అధికారులు బాధ్యతగా పనిచేయాలి

- కౌన్సిల్‌లో మంత్రి అంబటి రాంబాబు
- కౌన్సిలర్లు ఫోన్ చేస్తే స్పందించాలి



మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు, పక్కన చైర్‌పర్సన్ లక్ష్మీతులసి



సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు

సత్తెనపల్లి: ప్రజా సమస్యల పరిష్కారానికి కౌన్సిలర్లు అధికారులకు ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయకపోవడం మంచి సంప్రదాయం కాదని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం మున్సిపల్ చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీతులసి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. సమావేశంలో ఆయన ఎక్స్ అఫీషియోగా హాజరయ్యారు. కౌన్సిల్ సమావేశంలో తొలుత 31వ వార్డు కౌన్సిలర్ తురక మేరీగ్రేస్ మాట్లాడుతూ ఇటీవల పలుమార్లు అధికారులకు ఫోన్ చేసినా స్పందించలేదని కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. మంత్రి జోక్యం చేసుకొని ఇప్పటి వరకు ఎలా జరిగిందో పక్కన పెట్టండి.. ఇకపై మాత్రం కౌన్సిలర్లు ఫోన్ చేస్తే అధికారులు లిఫ్ట్ చేయాలని చెప్పారు. ఒక వేళ ఏదైనా సమావేశం, వీడియో కాన్ఫరెన్స్ వంటి వాటిల్లో ఉండి ఫోన్ లిఫ్ట్ చేయడానికి సాధ్యం కాక పోతే తరువాత తిరిగి కాల్ చేసి సమాధానం ఇవ్వాలని సూచించారు. కౌన్సిలర్ల ఫోన్ నబర్లు అధికారులు ఫీడ్ చేసుకోవాలన్నారు.

స్వాతంత్య్ర వేడుకల పనులు నిలిచిపోయినా..

7వ వార్డు కౌన్సిలర్ రంగిశెట్టి సుమన్ కుమార్ మాట్లాడుతూ స్వాతంత్య్ర దినోత్సవాలను పురస్కరించుకొని అత్యవసరంగా మున్సిపల్ కార్యాలయానికి రూ.3.30 లక్షలతో పెయింట్లు వేయాలని నిర్ణయించి నామినేషన్ పద్ధతిపై ర్యాటిఫికేషన్ చేశారన్నారు. ఇప్పటి వరకు పని పూర్తి కాలేదన్నారు. కమిషనర్ కొలిమి షమ్మి సమాధానం ఇస్తూ ఈ నెల 8న నిర్వహించడం అయిందని చెప్పారు. కొంత జాప్యం జరిగిందని అంగీకరించారు. స్పందించిన మంత్రి అంబటి ఎంత శాతం పనులు పూర్తయ్యాయని ప్రశ్నించారు. 60 శాతం పనులు పూర్తి అయ్యాయని, మిగిలిన 40 శాతం పూర్తి చేస్తామని సమాధానం ఇచ్చారు.

ఆయిల్ బిల్లులపై అసంతృప్తి..

కౌన్సిలర్ సుమన్ కుమార్ మాట్లాడుతూ ఖర్చుల్లో ఆయిల్ బిల్లు రూ.5,28,938 చూపారని, గత నెల ఆయిల్ బిల్లులు అడిగితే మంత్రి అంబటి రాంబాబు చెప్పినా కూడా అధికారులు ఇవ్వడం సాధ్యం కాదన్నారని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఏ బండికి ఎంత పడుతుంది? ద్విచక్ర వాహనాలకు కొట్టించారా, నాలుగు చక్రాల వాహనాలకు కొట్టించారా, కార్లకు కొట్టించారా అనేది సమాచారం ఇవ్వాలన్నారు. స్పందించిన మంత్రి కౌన్సిలర్ సుమన్ అడిగిన విధంగా ఆయిల్ బిల్లుకు సంబంధించిన వివరాలు ఎందుకు ఇవ్వలేదని కమిషనర్ షమ్మిని నిలదీశారు. కౌన్సిలర్‌కు అందించాలని కోరారు. కమిషనర్ మాట్లాడుతూ మాట్లాడుతూ 150 పేజీలు రావడంతో సిబ్బంది ఇవ్వలేదని, తన దృష్టికి తెస్తే అదే రోజు ఇచ్చేవాడినన్నారు.

కాంట్రాక్టు కమిటీ వేయాలి..

కౌన్సిల్‌లో కాంట్రాక్టు, తదితర కమిటీలను ఏర్పాటు చేయాలని కౌన్సిలర్ సుమన్ కుమార్ కోరారు. హౌసింగ్ లేఔట్స్ గండ్లూరు, ధూళిపాళ్లలో నీటి సరఫరాకు సంబంధించిన ఎలక్ట్రికల్ వైర్లు, స్టార్టర్స్, ప్యానెల్ బోర్డులు రిపేర్లు చేసే పనికి రూ.లక్ష అంచనా వేశారని, రిపేర్లు ఎందుకు వచ్చాయని ప్రశ్నించారు. దీనిపై మంత్రి అంబటి మాట్లాడుతూ కమిటీల ఏర్పాటు నిబంధనల ప్రకారం తప్పనిసరి అయితే వెంటనే ఏర్పాటు చేయాలని సూచించారు. కమిషనర్ కొలిమి షమ్మి మాట్లాడుతూ అక్కడ ఏర్పాటు చేసిన ప్యానెల్ బోర్డులు కొన్ని పని చేయడం లేదని, వైర్లు, తదితర వాటిని చోరీకి గురైనట్లు వివరించారు. కొన్ని రిపేర్లు రావడంతో వాటిని ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. అజెండాలోని అన్ని అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించాలని 24వ వార్డు కౌన్సిలర్ అచ్యుత శివప్రసాద్ కోరగా కౌన్సిలర్లంతా ఆమోదం తెలిపారు. తొలుత విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మున్సిపల్ మేనేజర్ సాంబశివరావు, ఏఈ సాగర్‌లకు 31వ వార్డు కౌన్సిలర్ తురక మేరీగ్రేస్ అభినందనలు తెలిపారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు షేక్ నాగూర్ మీరాన్, రమావత్ కోటేశ్వరరావు నాయక్ పాల్గొన్నారు.

వార్డులో చెత్త డంప్ చేస్తున్నారు

కౌన్సిలర్ మేరీగ్రేస్ మాట్లాడుతూ 31వ వార్డు స్లమ్ ఏరియా అని, శానిటేషన్ సమస్య ఎక్కువగా ఉంటుందన్నారు. పట్టణంలో ఉన్న చెత్తంతా వార్డులో డంప్ చేస్తున్నారని, ట్రోజర్‌తో తెచ్చిన సమయంలో ఆ ప్రాంతమంతా పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన మంత్రి అంబటి గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ బేస్మెంట్ లెవల్‌లో ఉందని, అది పూర్తయితే శానిటేషన్ సమస్య ఉండదన్నారు. అయినప్పటికీ సేకరించిన చెత్తా చెదారాన్ని జిందాల్‌కు పంపడం జరుగుతుందని వివరించారు. కమిషనర్ కొలిమి షమ్మి మాట్లాడుతూ వార్డుల్లో కొంత సేపు నిలువ చేసే దానికి ఇబ్బంది ఎదురవుతున్న దృష్ట్యా నరసరావుపేట రోడ్డులోని డంపింగ్ యార్డు వద్ద ఒక చోట ఏర్పాటు చేసి దానిని జిందాల్‌కు పంపుతున్నామని ఇచ్చారు.

చేపలు మార్కెట్ మంజూరు చేయాలి

మంత్రి అంబటి రాంబాబుకు మాజీ కౌన్సిలర్ ఆదెయ్య వినతి



సత్తెనపల్లి: పట్టణంలో చేపలు మార్కెట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మాజీ కౌన్సిలర్ మంగళపూరి ఆదెయ్య కోరారు. మున్సిపల్ కార్యాలయం వద్ద రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబును కలసి గురువారం వినతిపత్రం అందించారు. ఆదెయ్య మాట్లాడుతూ పురపాలక సంఘ పరిధిలో 200 మంది మత్స్యకార కుటుంబాలు జీవిస్తున్నట్లు చెప్పారు. పురపాలక సంఘ పరిధిలో చేపలు అమ్ముకోవడానికి ఏ విధమైన మార్కెట్ లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. తగిన న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, మున్సిపల్ వైస్ చైర్మన్లు షేక్ నాగూర్ మీరాన్, రమావత్ కోటేశ్వరరావు నాయక్, నాయకులు గంటా ఏసుబాబు, అచ్యుత శివప్రసాద్, షేక్ మౌలాలి, సెగ్గెం వెంకటేశ్వరరావు, వల్లెం నరసింహారావు, చిలుకా రమణయ్య, షేక్ గని, బండి మల్లికార్జునరెడ్డి, హైదరాబాద్ సుభాని ఉన్నారు.

క్లుప్తంగా

మంత్రి అంబటికి రాఖీ కట్టిన డాక్టర్ గీతా హాసంతి



మంత్రి అంబటి రాంబాబుకు రాఖీ కట్టి ఆశీస్సులు పొందుతున్న డాక్టర్ గీతహసంతి

సత్తెనపల్లి: మన సంస్కృతి, సంప్రదాయాలలో రాఖీ పౌర్ణమికి విశేషమైన ప్రాచుర్యం ప్రాధాన్యం ఉందని, అనుబంధాలకు రక్షాబంధనమైన రాఖీలు కట్టుకోవడం సోదర సోదరీమణుల మధ్య బాంధవ్యాలకు ప్రతీకని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. గురువారం ఆయన నివాసంలో రాష్ట్ర కో ఆపరేటివ్ ఫైనాన్స్ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా మహిళా అధ్యక్షురాలు డాక్టర్ గీత హసంతి, మంత్రి అంబటి రాంబాబుకు రాఖీ కట్టారు. ఆయన ఆశీస్సులు తీసుకున్నారు.

దస్తావేజు లేఖర్ల జీవనోపాధికి ఇబ్బంది

సత్తెనపల్లి: స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖలో నూతనంగా ప్రవేశపెట్టనున్న కార్డు ప్రైమ్ 2.0తో దస్తావేజు లేఖర్లు జీవనోపాధి కోల్పోతారని వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాధంశెట్టి వేదాద్రి అన్నారు. పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సమీపంలో దస్తావేజు లేఖరులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలో గురువారం ఆయన పాల్గొని మాట్లాడారు. ఆస్తుల రిజిస్ట్రేషన్‌లో కొత్త పద్ధతి అమలు చేస్తే వేలాది మంది జీవనోపాధి కోల్పోయి రోడ్డును పడతారని ఆందోళన వ్యక్తం చేశారు. దస్తావేజు లేఖర్లతోపాటు డీటీపీ ఆపరేటర్లు, స్టాంపు వెండర్ల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు దాసరి జ్ఞానరాజు పాల్ మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ కొరకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆన్లైన్ విధానం వలన రిజిస్ట్రేషన్ ఆస్తులకు భద్రత ఉండదని, రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో మంది దస్తావేజు లేఖరుల కుటుంబాలు రోడ్డున పడవలసి వస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తుమ్మలగుంట రామకృష్ణ, కోట ఆనంద్, సిద్దెల మోహన్‌రావు, జెట్టి శేఖర్ పాల్గొన్నారు.

సమ్మెలో దస్తావేజు లేఖర్లు

క్రోసూరు: రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ల విధానాన్ని డిజిటల్ విధానంలోకి తీసుకురావటంతో మండలంలోని దస్తావేజు లేఖర్లు రెండురోజులుగా సమ్మెబాట పట్టారు. క్రోసూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఉన్న దస్తావేజు లేఖర్ల షాపులను మూసివేశారు. దస్తావేజు లేఖరి విజయసారధి రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రైం 2.0 సాఫ్ట్‌వేర్ వల్ల తాము ఉపాధి కోల్పోతామేని, రిజిస్ట్రేషన్ల కొరకు వచ్చే ప్రజలకు తాము సహాయకులుగా ఉంటూ వారికి ఉపయోగపడుతున్నామని చెప్పారు. ఈ దశలో ప్రభుత్వం తమ ఉపాధి లేకుండా చేయటం అన్యాయమని పేర్కొన్నారు.

సెప్టెంబర్ 2న గద్దర్ సంస్మరణ సభ



సత్తెనపల్లి: గద్దర్ సంస్మరణ సభ సెప్టెంబర్ 2వ తేదీ నిర్వహించనున్నట్లు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దాసరి జ్ఞానరాజ్‌పాల్ తెలిపారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయ ఆవరణలో కరపత్రం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఎదురు నిర్వహించే సభకు గద్దర్ కుమార్తె వెన్నెల పాల్గొంటారన్నారు. ప్రజానాట్యమండలి బృందం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మాదం శెట్టి వేదాద్రి, ప్రజాసంఘాల నాయకులు దావులూరి కోటేశ్వరరావు, గుంటూరు ఆశీర్వాదం, జిల్లెళ్ళ పాల్‌రాజ్ ఉన్నారు.

వృక్షాంజనేయస్వామికి విశేషపూజలు

నకరికల్లు: స్థానిక ఎన్నెస్పీ కాలనీలోని వృక్షాంజనేయస్వామి ఆలయంలో గురువారం భక్తిశ్రద్ధలతో ఏకాహం ప్రారంభించారు. పూర్వాభాద్ర నక్షత్రం పురస్కరించుకొని ఉదయం 8గంటల నుంచి ఏకాహం ప్రారంభమైంది. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి హరేరామా హరేకృష్ణ నామస్మరణ చేశారు. విశేషద్రవ్యములతో అభిషేకాలు చేశారు. ప్రత్యేకంగా అలంకరించారు. వృక్షాంజనేయస్వామి ఆలయ కమిటీ వారు మాట్లాడుతూ ప్రారంభించిన సమయం నుంచి 24 గంటల అనంతరం శుక్రవారం ఉదయం 8 గంటలకు ఏకాహం ముగుస్తుందన్నారు. ఏకాహం ముగింపు సందర్భంగా విశేష పూజలు చేయనున్నట్లు పేర్కొన్నారు.

నేటి నుంచి సామాజిక పింఛన్లు పంపిణీ

క్రోసూరు: ప్రతి నెలా ప్రభుత్వం అందించే సామాజిక పింఛన్లు సెప్టెంబర్‌కు సంబంధించిన పింఛన్లు శుక్రవారం నుంచి పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఎ బి.మహేష్‌బాబు గురువారం తెలిపారు. మండలంలో 15 సచివాలయాలలో మొత్తం పింఛన్‌దారులు 8,603 మంది ఉన్నారని వారికి మొత్తం రూ.23,83,4,750(23 కోట్ల,83 లక్షల,4 వేల, ఏడువందల యాభై) మంజూరు అయిందని చెప్పారు. వలంటీర్లు వారి పరిధిలోని లబ్ధిదారులకు అందజేస్తారని ఎంపీడీఓ పేర్కొన్నారు. 141 మంది కొత్త పింఛన్లు అనుమతి పొందినట్లు తెలిపారు.

మిరప సాగులో జాగ్రత్తలు పాటించాలి



క్షేత్ర స్థాయిలో రైతులకు సూచనలు చేస్తున్న ఉద్యాన శాఖాధికారిణి జనని

సత్తెనపల్లి: మిరప సాగులో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని ఉద్యాన శాఖాధికారిణి సీహెచ్ జనని అన్నారు. సత్తెనపల్లి మండలం కొమెరపూడి, నందిగామ గ్రామల్లో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో మిరప పంటపై రైతులకు గురువారం అవగాహన కల్పించారు. క్షేత్ర స్థాయిలో మిరప పంట, షేడ్ నెట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉద్యాన శాఖ అధికారిణి జనని మాట్లాడుతూ మిరప పంటల్లో ప్రస్తుతం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులు అవగాహన కలిగి ఉండాలన్నారు. అలసంద, పిల్లి పెసర, పెసర లాంటి పచ్చిరొట్టపైర్లను వేసి ఉంటే రోటవేటర్‌తో నెలలో కలియ దున్నాలని చెప్పారు. రసాయనిక ఎరువులు మీద ఆధారపడకుండా అందించాల్సిన మొత్తం పోషకాలలో 25 శాతం సేంద్రియ ఎరువులు రూపంలో వేయాలన్నారు. ఎకరానికి 10 టన్నులు పశువుల ఎరువు, 25 కిలోలు వేప పిండి వేయాలన్నారు. జీవన ఎరువులైన ఎజాస్పరులం, పాస్ఫర్ బ్యాక్టీరియా, వ్యామ్ పొటాష్ బ్యాక్టీరియా, జీవన సిలింద్రాలై న ట్రైకోడెర్మా సూడోమోస్ పశువులు ఎరువులతో వాడటం వలన నేల ద్వారా సంక్రమించే ఎండు తెగులు, వేరు కుళ్ళు తెగులు వంటివి నివారించ వచ్చునన్నారు. వ్యామ్ వాడటం వలన నీటి ఎద్దడిని తట్టుకోవడమే కాకుండా వేరు వ్యవస్థ పటిష్ఠపరుస్తూ భూమిలో ఉన్న పోషకాలను మొక్కకు అందిస్తుందన్నారు. నాటేటప్పుడు దుక్కిలో యూరియా 65 కేజీలు, సూపర్ ఫాస్ట్ 150 కేజీలు ఎకరంకు మిరప పంటలో వేయాలన్నారు. జింక్ లోపం ఉంటే భూమిలో ఎకరాకు 10 కిలోలు చొప్పున జింక్ సల్ఫేట్ దుక్కిలో వేయాలని, లేదా నాటిన 30-45 రోజులు మధ్య లీటర్ నీటికి ఐదు గ్రాములు చొప్పున జింక్ సల్ఫేట్ కల్పిన ద్రావణాన్ని పైర్ల పై పిచికారి చేయాలన్నారు. ఇనుప ధాతులోప నివారణకు లీటర్ నీటికి ఐదు గ్రాముల అన్నబేది, రెండు గ్రాముల నిమ్మ ఉప్పు చొప్పున కలిపి పిచికారి చేయాల న్నారు. కార్యక్రమంలో గ్రామ ఉద్యాన సహాయకులు షేక్ మౌలాలి, శంకర్ పాల్గొన్నారు.

రౌండ్‌టేబుల్ సమావేశం కరపత్రాలు ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

నకరికల్లు: రాష్ట్రంలోని జీడి పిక్కల రైతాంగాన్ని ఆదుకునేందుకు 80 కేజీల బస్తాకు రూ.16వేల గిట్టుబాటు ధర కల్పించాలని పీడీఎం, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 9న విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించనున్న రౌండ్‌టేబుల్ సమావేశం కరపత్రాలను స్థానిక అబ్దుల్‌కలాం సెంటర్‌లో గురువారం ఆవిష్కరించారు. పీడీఎం నాయకులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో జీడిమామిడి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని, జీడి పరిశ్రమ కేంద్రాలు ప్రాంతాల వారీగా ఏర్పాటు చేసి అభివృద్ధి పరచిన మొక్కలు రైతులకు అందజేయాలని, వడ్డీలేని రుణాలు, రాయితీలు, సబ్సిడీపై ఎరువులు, పురుగుమందులు అందించాలని, జీడిపిక్కలు ఆరబెట్టేందుకు టార్పాలిన్ పట్టలు, నిల్వ చేసుకునేందులు గోడౌన్‌లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎం జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి, గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.కోటానాయక్, ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి షేక్ సైదా, మాలమహానాడు సోషల్‌మీడియా ఇన్‌చార్జి గోదా బాల, లాలూ, పోటు వెంకటేశ్వర్లు, చట్టు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రేపటి నుంచి త్రి శక్తి దుర్గాపీఠం వార్షిక బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక అలంకరణలోఅమ్మవార్లు

సత్తెనపల్లి: పట్టణంలోని భవిష్య పాఠశాల సమీపంలోని త్రిశక్తి దుర్గాపీఠం 17వ వార్షిక బ్రహ్మోత్సవాలు సెప్టెంబర్ 2 నుంచి నిర్వహించనున్నారు. త్రిశక్తి స్వరూపిణులైన మహాలక్ష్మి, దుర్గ, సరస్వతి అమ్మవార్ల బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. మూడు రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాల్లో ప్రత్యేక పూజలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. 2న ఉదయం 7 గంటలకు మంగళ వాయిద్యాలు, 8 గంటలకు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహం, దీక్షా చరణ, కలశ స్థాపన, 8.30 గంటలకు అఖండ దీపారాధన, 9 గంటలకు లక్ష్మీ గణపతి, ప్రసన్నాంజనేయ, మహాలక్ష్మి సరస్వతీ సమేత దుర్గామాతకు దశవిధ అభిషేకాలు, 108 కళశాలతో అభిషేకాలు నిర్వహించనున్నారు. 10.30 గంటలకు అమ్మవార్లకు పసుపు, కుంకుమ సమర్పణ, 11 గంటలకు లలిత సహస్రనామ పారాయణం, అమ్మవార్లకు అర్చన, హారతి మంత్రపుష్పం, ప్రసాద వితరణ చేపట్టనున్నారు. సాయంత్రం 5.30 గంటలకు అమ్మవార్ల ఊరేగింపు చేపట్టనున్నారు. ఈ ఊరేగింపు ప్రారంభోత్సవానికి పల్నాడు జిల్లా ఎస్పీ వై.రవిశంకర్ రెడ్డి హాజరుకానున్నారు. అలాగే 3న ఉదయం 7 గంటలకు మంగళ వాయిద్యాలు, 7.30 గంటలకు విఘ్నేశ్వర పూజ, ప్రసన్నాంజనేయ స్వామి వారికి లక్ష నాగవల్లి దళములతో విశేష పూజలు, 9.30 గంటలకు అమ్మవార్లకు ప్రభ ఏర్పాటు చేయనున్నారు. దీని ప్రారంభకులుగా ఆరో వార్డు కౌన్సిలర్ సదనం సత్యవాణి హాజరుకానున్నారు. 11 గంటలకు గురుపూజ మహోత్సవం, 11.30 గంటలకు అమ్మవార్లకు అన్నాభిషేకం, మధ్యాహ్నం ఒంటిగంటకు అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించనున్నారు. అన్నసంతర్పణ కార్యక్రమాన్ని పట్టేం వెంకటేశ్వర్లు లలిత కుమారి దంపతుల కుమారుడు పట్టేం భాను ప్రసాద్ ప్రారంభించనున్నారు. 4న ఉదయం 7 గంటలకు మంగళ వాయిద్యాలు, 7.30 గంటలకు చండీ హోమం, అనంతరం పూర్ణాహుతి, మంత్రపుష్పం, హారతి, 9.30 గంటలకు శివపార్వతుల కల్యాణం, 11 గంటలకు సామూహిక కుంకుమార్చన, గాజుల పూజ, 8 గంటలకు పవళింపు సేవ నిర్వహించనున్నారు. ప్రముఖ అర్చకులు కలవకొలను సీతారామశాస్త్రి ఆధ్వర్యంలో బ్రహ్మోత్స వాలు జరుగుతాయని పీఠాధిపతి వెలిదండ్ల హనుమంతరావు గురువారం తెలిపారు.

నేత్రదానంపై వ్యాసరచన పోటీలు



అమరావతి: జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా మండల పరిధిలోని వైకుంఠపురం ఎంపీయూపీ పాఠశాలలో అత్తలూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు గురువారం నిర్వహించారు. నేత్రదానం ఆవశ్యకతపై నిర్వహించిన వ్యాసరచన పోటీలలో మొదటి స్థానంలో ఎ.లాల్ చాందినీ, ద్వితీయ స్థానం నండూరి తేజశ్రీ, తృతీయ స్థానం నండూరి అఖిల్ సాధించారు. ఈసందర్భంగా విజేతలకు కంటి వైద్యాధికారి పీవీఎస్ రామసుబ్బారావు అందజేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ, పాఠశాల సిబ్బంది జి.ఆనందరావు, ఇందిర, సుజాత, సవితా నల్లమ్మ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

రాజుపాలెం: విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ ప్రసాద్ గురువారం తెలిపారు. ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు. మండలంలోని గణపవరం బలిజేపల్లి, ఇనిమెట్ల, ఉప్పలపాడు, రామిరెడ్డిపేట వినియోగదారులు సహకరించాలని కోరారు.

పెరికపాడు సర్పంచి శ్రీధర్ ప్రమాణస్వీకారం



పెరికపాడు(క్రోసూరు): గ్రామ సర్పంచిగా ఊడల శ్రీధర్ శుక్రవారం ప్రమాణస్వీకారం చేశారు. ఇటీవల జరిగిన పంచాయతీ ఉప ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం తెలిసిందే. గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పంచాయతీ విస్తరణాధికారి పి.శివరామయ్య ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఎంపీపీ పి.కోటయ్య, జెడ్పీటీసీ సభ్యుడు షేక్ జమీలాగఫార్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెలది అప్పారావు, గ్రామ ఉపసర్పంచి మస్తాన్‌రావు, నర్రా వాసుదేవమూర్తి పాల్గొన్నారు.

కాశీవిశ్వేశ్వరాలయంలో శ్రావణపౌర్ణమి పూజలు



నర్సింగపాడులోని అమ్మవారు



ప్రత్యేక అలంకరణలో శ్రీవారు

నకరికల్లు: శ్రావణపౌర్ణమి పురస్కరించుకొని మండలంలోని నర్సింగపాడు గ్రామంలోని అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో గురువారం విశేష పూజలు చేశారు. అర్చకులు కొమ్మవరపు పవన్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో స్వామికి విశేష ద్రవ్యములతో అభిషేకాలు చేశారు. స్వామివారిని, అమ్మవారిని విశేషంగా అలంకరించారు.

సాయిబాబా మందిరంలో రాఖీపౌర్ణమి పూజలు

క్రోసూరు: స్థానిక సాయిబాబా మందిరంలో రాఖీపౌర్ణమి పురస్కరించుకుని గురువారం బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి గురువారం నిర్వహించే అన్నదాన కార్యక్రమాలకు ఆలయంలోనే వంట కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో మందిర కమిటీ అధ్యక్షుడు మన్నెం వెంకట్రావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీవారికి స్నాపన తిరుమంజనం

సత్తెనపల్లి: పట్టణంలోని రైల్వే స్టేషన్‌రోడ్డులోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో గురువారం శ్రావణ రాఖీ పౌర్ణమి సందర్భంగా శ్రీవారికి స్నాపన తిరుమంజనం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామికి ప్రత్యేక అలంకరణ చేపట్టి పూజలు చేశారు. శ్రీవారి ఊరేగింపు కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అంగన్‌వాడీలకు యూనిఫాం అందజేత



అంగన్‌వాడీ కార్యకర్తలకు, ఆయాలకు యూనిఫాం పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యులు

అచ్చంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనలోనే అంగన్‌వాడీ కేంద్రాలకు, కార్యకర్తలకు గుర్తింపు వచ్చిందని జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి అన్నారు. మండలంలోని చెరుకుంపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలకు, ఆయాలకు ఒక్కొక్కరికి రెండు జతల చొప్పున యూనిఫాం(దుస్తులు) పంపిణీ చేశారు. గత ప్రభుత్వ హయాంలో జనాభా లెక్కల నుంచి బీఎల్‌ఓ డ్యూటీల వరకు అంగన్‌వాడీ కార్యకర్తలతో చేయించుకునేవారని, పనికి తగిన వేతనాలు కూడా ఇచ్చే వారు కాదని అన్నారు. అచ్చంపేట మండలంలో 69 అంగన్‌వాడీ కేంద్రాలుండగా 67 మంది టీచర్లు, 65 మంది ఆయాలు పనిచేస్తున్నారన్నారు. అందరికి రెండు జతల చొప్పున యూనిఫాం పంపిణీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి చింతగుంట్ల అనూరాధ, హనుమంతరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు చిన్నపరెడ్డి, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

ముస్లిం కమ్యూనిటీ హాల్ పనులు పరిశీలన



అమరావతి: మండల పరిధిలోని ధరణికోట ముస్లిం కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే నంబూరు శంకరరావు గురువారం పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ డీఎంఎఫ్ నిధులు సుమారు రూ.25 లక్షలతో చేపట్టినట్లు వివరించారు. పనులు వేగవంతం చేయాలని కోరారు.

నేడు గౌసియామజీద్ ప్రారంభోత్సవం

అచ్చంపేట: స్థానిక చామర్రు రోడ్డులో నూతనంగా నిర్మించిన గౌసియా మజీద్‌ను ఎమ్మెల్యే నంబూరు శంకరరావు శుక్రవారం ప్రారంభించనున్నారు. ముస్లింలు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాల్సిందిగా పార్టీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య కోరారు.

నేడు పాపాయపాలెంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

బెల్లంకొండ: మండలంలోని పాపాయపాలెంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించనున్నట్లు ఎంపీపీ చిన్నపరెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పాల్గొంటారని చెప్పారు.

నేడే సామూహిక వరలక్ష్మీ వ్రతం

అమరావతి: శ్రావణమాసం మూడో శుక్రవారం సందర్భంగా అమరేశ్వరాలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ. వేమూరి గోపినాథ శర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయంలో జ్వాలాముఖీ, బాలచాముండేశ్వరి అమ్మవార్లకు ఉదయం నుండి శ్రావణ శుక్రవారం ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా రక్షాబంధన్

అమరావతి: స్థానిక శ్రీ సరస్వతీ శిశు మందిర్ విద్యాలయంలో గురువారం రక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థినీలు విద్యార్థులకు రక్షాబంధన్ కట్టారు. పాఠశాల ఉపాధ్యాయులు కోలా వెంకటేశ్వరరావు, రామ్మోహన్‌శర్మ, పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలపై నిరసన

అమరావతి: కేంద్ర ప్రభుత్వ రైతు, కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో గురువారం స్థానిక పంచాయతీ కార్యదర్శి నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. సీపీఎం మండల కార్యదర్శి బి.సూరిబాబు మాట్లాడుతూ కేంద్రంలో మతోన్మాద బీజేపీ ప్రభుత్వం నిరుద్యోగ సమస్యని పరిష్కరించడంలో ధరలు అదుపు చేయటంలో ఘోరంగా విఫలమైందన్నారు. కార్యక్రమంలో ఎస్‌డీ మోహిదీన్ వలి, ఎస్ కే రఫీ, ఎం.నవీన్ పాల్గొన్నారు.

పాడి పరిశ్రమను ప్రోత్సహించేందుకు రుణాలు

చాగంటివారిపాలెం(ముప్పాళ్ల): పాడి రైతులకు జీడీసీసీ బ్యాంకు ద్వారా ప్రభుత్వం రుణాలు అందిస్తూ వారికి అండగా ఉంటుందని పశుసంవర్ధకశాఖ ఏడీఏ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని చాగంటివారిపాలెంలో గురువారం రుణమేళా నిర్వహించారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి కరుణాకరరెడ్డి పాల్గొన్నారు.